క్లుప్తంగా

రిక్రియేషన్ రూమ్ ప్రారంభం



రిక్రియేషన్ రూమ్‌లో పరిశీలిస్తున్న వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా

సింధియా: ది ఇయర్ ఆఫ్ నేవల్ సివిలియన్స్ వేడుకల్లో భాగంగా విశాఖలోని తూర్పు నావికాదళ బేస్ విక్చువలింగ్ యార్డ్‌లో రిక్రియేషన్ రూమ్‌ను బుధవారం చీఫ్ ఆఫ్ నేవల్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా ప్రారంభించారు. అనంతరం యార్డ్‌లోని స్టోర్ హౌస్‌ల చుట్టూ పర్యటించి సిబ్బందితో ముచ్చటించారు.

చురుగ్గా ఓటరు జాబితాల పరిశీలన



62వ వార్డులో ఓటరు జాబితా పరిశీలనలో బీఎల్‌వోలు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్‌నగర్‌లోని 120 పోలింగ్ బూత్ పరిధిలో ఓటరు జాబితా పరిశీలన కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆదేశాల మేరకు బుధవారం బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను నిశితంగా పరిశీలించారు. మృతి చెందిన, వలస వెళ్లిన, వివాహమై వేరే ప్రాంతాలకు వెళ్లిన ఓటర్లను గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు పక్కా ఆధారాలు తీసుకుని, ఒకే ఇంట్లో అధిక సంఖ్యలో ఓట్లు ఉంటే వాటిని పరిశీలించి సూచనలిచ్చారు.

ఆనంద్‌కుమార్ గెలుపే లక్ష్యంగా శ్రమిద్దాం



సమావేశంలో పాల్గొన్న క్లస్టర్ నాయకులు


మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు పరిధి ఆర్‌కేపురం వద్ద క్లస్టర్ ఉపాధ్యక్షుడు ఆడారి రమణబాబు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జీవీఎంసీ 61,62,63,40 వార్డుల పరిధి క్లస్టర్ నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమానికి క్లస్టర్-1 అధ్యక్షుడు బద్రీనాథ్, జేసీఎస్ కన్వీనర్ భోగవల్లి నాగభూషణం మాట్లాడుతూ క్లస్టర్ పరిధిలో ఉన్న ప్రతి ఒక్క సభ్యుడు, నాయకుడు ఆడారి ఆనంద్‌కుమార్ గెలుపునకు చొరవ చూపాలన్నారు. రెండేళ్లుగా పశ్చిమలో ఆనంద్‌కుమార్ చేసిన అభివృద్ధిని ఓటర్లకు వివరించి, వారు పార్టీకి ఓటు వేసేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో 63వ వార్డు పార్టీ ఇన్‌చార్జి పిలక రామ్మోహన్‌రెడ్డి (రాము), నాయకులు దాడి సత్యనారాయణ (డిపో) తదితరులు పాల్గొన్నారు.

విశాఖకు షారుఖ్ ఖాన్, పార్థ్ జిందాల్



విశాఖ విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న షారుఖ్ ఖాన్

గోపాలపట్నం: ఐపీఎల్‌లో భాగంగా విశాఖలో ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌ను తిలకించేందుకు ఆయా జట్ల యజమానులు పార్థ్ జిందాల్, బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ బుధవారం సాయంత్రం విశాఖపట్నం చేరుకున్నారు. షారుఖ్ ముంబై నుంచి ప్రత్యేక విమానంలో నగరానికి వచ్చారు. పార్థ్ జిందాల్ ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకున్నారు. వీరు రోడ్డు మార్గాన నగరంలోకి బయలుదేరి వెళ్లారు.



విమానాశ్రయం నుంచి కారులో నగరంలోకి బయలుదేరిన పార్థ్ జిందాల్

బాబు వల్లే మాకీ పాట్లు

- సచివాలయాల వద్ద వృద్ధుల పడిగాపులు
- పింఛన్ కోసం ప్లకార్డులతో నిరసన



కూర్చోవడానికి కూడా ఇబ్బంది పడుతున్న వృద్ధులు



పింఛన్ కోసం తల్లి దేముడమ్మ సాయంతో వస్తున్న మారుతి నాగమణి



గోపాలపట్నం సచివాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పింఛన్‌దారులు

గోపాలపట్నం: చంద్రబాబు హయాంలో పింఛన్ల కోసం కష్టాలు పడ్డాం. మళ్లీ ఆయన వల్లే ఈ ఖర్మ దాపురించిందని పలువురు వృద్ధులు వాపోతున్నారు. నడవలేని స్థితిలో ఉన్న తమను సచివాలయానికి వెళ్లి పింఛను తీసుకోమంటున్నారు. ఇంత ఎండలో ఎలా వెళ్లగలమని ప్రశ్నిస్తున్నారు. ఉదయం వచ్చిన తమకు మధ్యాహ్నం అయినా పింఛను ఇవ్వలేదని వాపోయారు. జీవీఎంసీ 89వ వార్డు 91, 92 వార్డుల సచివాలయాల వద్ద ఇటువంటి దృశ్యాలు బుధవారం దర్శనమిచ్చాయి. చంద్రబాబు నాయుడి బృందానికి పింఛనుదారులంతా శాపనార్థాలు పెడుతున్నారు. తెల్లవారేసరికి ఇంటికి వచ్చి పింఛను అందిస్తున్న వలంటీర్లపై ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేయడం చాలా పొరపాటు అని తెలిపారు. ఇప్పుడు మళ్లీ బాబు, అతని మనుషులే ఇంటింటికి పింఛన్లు ఇవ్వాలని కోరడం విడ్డూరంగా ఉందని విమర్శిస్తున్నారు. పలు సచివాలయాల వద్ద ఇదేమి ఖర్మరా బాబూ అంటూ ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత కొన్ని సచివాలయాల్లో పింఛన్లు అందించారు.



పింఛన్ కోసం వస్తున్న బీర నారాయణరావు

90వ వార్డులో లబ్ధిదారుల అవస్థలు..

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు పరిధిలోని బుచ్చిరాజుపాలెంలో నివసిస్తున్న మారుతి నాగమణి దివ్యాంగురాలు కావటంతో తల్లి దేముడమ్మ సాయంతో బుధవారం సాయంత్రం 90వ వార్డు సచివాలయానికి వెళ్లి పింఛను డబ్బులు అందుకుంది. ఎంచక్కా ఇంటి దగ్గరకు వచ్చి వలంటీర్లు డబ్బులు ఇచ్చేవారు.. ఇప్పుడేమో సచివాలయం వరకు రావాల్సి వచ్చింది. వలంటీర్లను వద్దన్న బాబుకు ఇది తగునా అంటూ నాగమణి, ఆమె తల్లి దేముడమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన

సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం మధ్యాహ్నం తరువాత ప్రారంభించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సచివాలయాల వద్దే పెన్షన్లు పంపిణీ చేశారు. జీవీఎంసీ 52వ వార్డు నాలుగు సచివాలయాల పరిధిలో 690 మంది, 90వ వార్డు ఎనిమిది సచివాలయాల పరిధిలోని 1,106 మంది లబ్ధిదారులకు పింఛన్ అందించేలా జీవీఎంసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. సచివాలయ పరిధిలోని ఉద్యోగులందరికీ ఈ బాధ్యతలు అప్పగించారు. ఆధార్ నంబర్ లేదా ఫేసియల్ ఐరిష్ ద్వారా వివరాలను నమోదు చేసి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. 90వ వార్డు బుచ్చిరాజుపాలెం సచివాలయాన్ని జీవీఎంసీ అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ సందర్శించి పింఛన్ల పంపిణీని పరిశీలించారు. కొంతమంది లబ్ధిదారులతో మాట్లాడారు. సిబ్బందికి ఆయన పలు సూచనలిచ్చారు. లబ్ధిదారులెవ్వరినీ ఎక్కువ సేపు వేచి ఉండనీయకుండా, పింఛన్ డబ్బులు అందజేసి పంపించాలన్నారు. విశ్వనాథన్ వెంట జీవీఎంసీ 8వ జోన్ కమిషనర్ హేమలత, ఏపీడీ శ్రీరామ్ ఉన్నారు.



పాతగోపాలపట్నం వద్ద ఆటోలో పింఛన్ కోసం వెళ్తున్న వృద్ధురాలు



బుచ్చిరాజుపాలెం సచివాలయంలో పింఛన్ల పంపిణీ వివరాలు తెలుసుకుంటున్న ఏడీసీ విశ్వనాథన్

వలంటీర్ కోసం ఎదురు చూశా..



ప్రతి నెల ఒకటో తేదీ తెల్లవారే మా ప్రాంత వలంటరీ ఇంటికి పింఛన్ తెచ్చేది. కానీ చంద్రబాబు కుట్ర పన్నటంతో వలంటరీలు రారని తెలిసింది. నడవటం కష్టంగా ఉన్నా తప్పదు కనుక పింఛన్ సొమ్ము కోసం సచివాలయానికి వెళ్తున్నాను.

– నారాయణరావు, గాంధీజీ వీధి

తెల్లవారి నుంచి ఇక్కడే ఉన్నా..



ఇంటికి పింఛన్ ఇచ్చేందుకు వలంటరీ రాదని తెలిసి బాధపడ్డాను. దీనికి కారకుడైన చంద్రబాబు తీరును వ్యతిరేకిస్తున్నాను. నాలాంటి వారిని ఇలా ఇబ్బందులకు గురి చేస్తున్న చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో తప్పక బుద్ధి చెపుతాం. పింఛన్ కోసం తెల్లవారే సచివాలయానికి వచ్చి ఎదురు చూస్తున్నాను.

– పార్వతి, మల్కాపురం

హెచ్‌ఎస్‌ఎల్‌ను సందర్శించిన ఈఎన్‌సీ చీఫ్



ప్రాజెక్టుల గురించి వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్‌కు వివరిస్తున్న షిప్‌యార్డ్ సీఎండీ హేమంత్‌ఖత్రి

సింధియా: ఈస్టర్న్ నేవల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్, వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ బుధవారం హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌ను సందర్శించారు. ఇందులో భాగంగా షిప్‌యార్డ్‌లో జరుగుతున్న విస్తరణ పనులతో పాటు భవిష్యత్తు ఓడ నిర్మాణ ప్రాజెక్ట్‌లు, వాటి మరమ్మతులు, కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను షిప్‌యార్డ్ అధికారులు వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్‌కు వివరించారు. అనంతరం ఇండియన్ నేవీ కోసం నిర్మిస్తున్న డైవింగ్ సోర్ట్ వెసెల్‌ను కూడా సందర్శించారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు



92వ వార్డు ఎస్సీ, బీసీ కాలనీ సచివాలయంలో రాజీనామాలు చేస్తున్న వలంటీర్లు

గోపాలపట్నం: టీడీపీ, జనసేన నాయకుల విమర్శలు, తీరుపై వార్డు వలంటీర్లు నిరసనలు వ్యక్తం చేశారు. బుధవారం 91, 92, 89 వార్డుల పరిధిలోని పలు సచివాలయాల్లో వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. 92వ వార్డు పరిధిలో 12 మంది, ఇందిరానగర్ 479 సచివాలయం పరిధిలో 19 మంది, 89వ వార్డు 461 సచివాలయం పరిధిలో 11 మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. వీరి రాజీనామా పత్రాలు సచివాలయ ఎడ్మిన్లకు అందించారు. వీరంతా ప్రజలకు మంచి చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపునకు కృషి చేస్తామని చెబుతున్నారు. వృద్ధులకు పింఛన్లు ఇవ్వనీయకుండా చేశారని వాపోయారు.

ప్రజల మద్దతు వైఎస్సార్‌సీపీకే..



వైఎస్సార్‌సీపీలో చేరిన యువకులతో ఆడారి ఆనంద్‌కుమార్, నాయకులు

- 'పశ్చిమ' ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్
- 89వ వార్డులో ఉత్సాహంగా ప్రచారం

గోపాలపట్నం: పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకే ప్రజల మద్దతు ఉందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 89వ వార్డు నాగేంద్ర కాలనీ, డీఏఆర్ నగర్ ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం ఉత్సాహంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనకు స్థానిక ప్రజలు హారతులిచ్చి, పూల దండలతో ఘన స్వాగతం పలికారు. నాగేంద్ర కాలనీ శివాలయంలోని సంతోషిమాతను దర్శించుకుని ప్రచారం ప్రారంభించారు. ఈ ప్రాంతంలో పలువురితో మాట్లాడుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకుంటూ ప్రచారం చేశారు. ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో మా ప్రాంత రహదారులు బాగుపడ్డాయని ఆయనకు వాటిని నాగేంద్ర కాలనీ వాసులు చూపించారు. మీరే ఎమ్మెల్యేగా రావాలని.. మా ఓట్లన్నీ మీకే వేస్తామని ఆయనతో అన్నారు.

కష్టకాలంలో అండగా ఉన్నాం..

డీఏఆర్ నగర్, సంతోష్ నగర్ ప్రాంతాల్లో ఆడారి ఆనంద్‌కుమార్ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్ల లబ్ధిపొందని విశ్వాసం ప్రజల్లో ఉందన్నారు. మంచి జరిగితే ఓటు వేయండని చెప్పగలిగే ధైర్యం ఉన్న నాయకుడని అన్నారు. ప్రజలంతా తన కొడుకని, తోడబుట్టిన వాడని, మామయ్యని ఇలా అన్ని వర్గాల వయసుల వారంతా గుండెల్లో పెట్టుకున్నారని తెలిపారు. ఈ ఐదేళ్ల కాలంలో రెండేళ్ల పాటు ప్రజలను, ప్రభుత్వాలను కరోనా మహమ్మారి అచేతుల్ని చేసిందని గుర్తుచేశారు. అలాంటి సమయంలో దేశాల ప్రధానులు, అధ్యక్షులు మీడియాకే పరిమితమయ్యారని, మన రాష్ట్రంలో మాత్రం ప్రజలందరికీ వలంటీర్ల ద్వారా సీఎం వైఎస్ జగన్ సాయమందించారన్నారు. కష్టకాలంలో సైతం ప్రజల్లో మనోధైర్యాన్ని నింపారని కొనియాడారు. ఐదేళ్లలో మిగిలిన మూడేళ్లు అభివృద్ధి అంటే ఏంటో ప్రజలకు చేసి చూపించారన్నారు. ప్రధానంగా విద్య, వైద్యంపై దృష్టి పెట్టి పేదల్లో సంతోషాలు నింపారన్నారు. అందుకే ప్రజల మద్దతు ఉందన్న విశ్వాసం మాలో ఉందన్నారు. మా స్టార్ క్యాంపెయినర్లు ప్రతీ కుటుంబంలో ఉన్నారని, మేము ప్రజల్లోకి వెళ్తుంటే ఫ్యాన్ గుర్తుకే ఓటు వేస్తామని చెబుతున్నారని ఆడారి ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. 89వ వార్డు క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రచారంలో పశ్చిమ ఎన్నికల పరిశీలకురాలు పేడాడ రమణికుమారి, పీఏసీఎస్ చైర్మన్ ఆళ్ల పైడిరాజు, డీకే ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు దొడ్డి కిరణ్, పార్టీ సీనియర్ నాయకులు అయింతంశెట్టి కోటేశ్వరరావు, మళ్ల శ్రీనివాసరావు, కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొత్తపాలెంలో ఆడారి ఆనంద్‌కుమార్‌కు హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న స్థానికులు



నాగేంద్ర కాలనీ వద్ద దుకాణంలో ఇస్త్రీ చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

పార్టీ కార్యాలయం ప్రారంభం

కొత్తపాలెం జంక్షన్ వద్ద వైఎస్సార్‌సీపీ వార్డు ఎన్నికల కార్యాలయాన్ని ఆడారి ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. పార్టీ కార్యకలాపాలు, సమావేశాలకు అనువుగా ఉండేలా ఈ కార్యాలయం ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో యువకుల చేరిక

కొత్తపాలెం, నాగేంద్ర కాలనీ, డీఏఆర్ నగర్ ప్రాంతాలకు చెందిన సుమారు 50 మంది యువకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. కొత్తపాలెం జంక్షన్ వద్ద నూతనంగా ప్రారంభించిన పార్టీ కార్యాలయంలో యువకులకు ఆడారి ఆనంద్‌కుమార్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. 89వ వార్డులో అత్యధిక మెజారిటీ వచ్చేందుకు తామంతా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. యువకుల చేరికతో పార్టీకి మరింత బలం వచ్చిందని ఆడారి అన్నారు. జగనన్న వల్లే ప్రజలకు మంచి జరుగుతుందని, అందుకే మళ్లీ ఆయనను ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న తనను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

క్రీడాకారులను ప్రోత్సహించింది జగనన్న ప్రభుత్వమే..

- సీఎం జగన్‌కు క్రీడాకారులంతా అండగా నిలవాలి
- ఎమ్మెల్యే అభ్యర్థి ఆనంద్‌కుమార్

మల్కాపురం: క్రీడాకారులను ప్రోత్సహించింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అని.. వారిలోని ప్రతిభను గుర్తించి మరింత ప్రోత్సహించేందుకే ఆడుదాం ఆంధ్ర వంటి కార్యక్రమం నిర్వహించిందని ఆ పార్టీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 59వ వార్డు నక్కవానిపాలెంలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో జరిగిన క్రీడాకారుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఏపీ రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రవిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంత పరిధిలో పలు క్రీడల్లో గుర్తింపు తెచ్చుకున్న క్రీడాకారులు ఉన్నారని, అయితే వారు నిత్యం ప్రాక్టీస్ చేసేందుకు సరైన మైదానం లేదన్నారు. గత పాలకులు, ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే గణబాబు క్రీడాకారుల సమస్యలను కనీసం గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించిన కొద్ది రోజుల్లోనే ఈ ప్రాంతంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు కృషి చేస్తానని క్రీడాకారులకు హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య ఎక్కువైందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ, వార్డు సచివాలయాల్లో యువతకు ఉద్యోగాలు కల్పించారన్నారు. యువత, క్రీడాకారులు జగన్ వెంట నడిచి ఆయనను మరల ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పశ్చిమ ఎన్నికల పరిశీలకులు ఎస్ఏ రెహమాన్, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్, బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్

నూకాంబిక ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీలోని నూకాంబిక అమ్మవారి ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం ఆలయ ధర్మకర్త, కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో లెక్కించారు. భక్తులు హుండీలో సమర్పించిన నగదు రూ.66,850 వచ్చింది. అనంతరం ఆలయ ధర్మకర్త నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 6 నుంచి 9 వరకు అమ్మవారి జాతర మహోత్సవాలు అత్యంత ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 6, 7 తేదీల్లో సాయంత్రం అమ్మవారి ఘటాలను గ్రామంలో ఊరేగిస్తున్నట్లు చెప్పారు. 8వ తేదీ సోమవారం కొత్త అమావాస్య సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు. అదే రోజు సాయంత్రం అమ్మవారిని పురవీధుల్లో మేళతాళాలతో ఘనంగా ఊరేగిస్తున్నట్లు తెలిపారు. 9వ తేదీ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తున్నామని, భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని నాగేశ్వరరావు కోరారు. కార్యక్రమంలో నూకాంబిక అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆడారి ఆనంద్‌కుమార్‌ను ఆశీర్వదించండి



దివ్యాంగుడితో మాట్లాడుతున్న ఆడారి మాలతి



బాజీ జంక్షన్‌లోని ఒక హోటల్‌లో పెసరట్టు వేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్ భార్య మాలతి

గోపాలపట్నం: వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ గెలుపు కోసం ఆయన భార్య ఆడారి మాలతి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. బుధవారం చిన్నబుచ్చిరాజుపాలెంలో స్థానికులందరినీ ఆమె ఆప్యాయంగా పలకరిస్తూ ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్ కుమార్‌ను విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి వారి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. సంక్షేమ పథకాలు ఏవిధంగా అందుతున్నాయో ఆరా తీశారు. ఇంటింటా ముత్తయిదువులకు కుంకుమ బొట్లు పెట్టి ఆడారి ఆనంద్‌కుమార్‌ను ఆశీర్వదించి, ఒకసారి అవకాశమివ్వాలని అభ్యర్థించారు. బాజి జంక్షన్‌లోని ఒక హోటల్‌లో ఆడారి మాలతి పెసరట్టు వేశారు. దివ్యాంగులు, వృద్ధులతో మాట్లాడారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. తామంతా జగనన్నకే ఓటు వేసి గెలిపిస్తామని స్థానికులంతా ఆమెతో అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, పశ్చిమ ఎన్నికల పరిశీలకురాలు పేడాడ రమణి కుమారి, వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

మల్కాపురం: రోడ్డు ప్రమాదంలో తలకు గాయమై చికిత్స పొందుతున్న ఓ యువకుడు బుధవారం ఉదయం మృతి చెందాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలిలా.. 58వ వార్డు ఉప్పర కాలనీలో రాంబాబు(26) అనే యువకుడు తన తల్లితో కలిసి నివసిస్తున్నాడు. నేవల్ డాక్‌యార్డ్ వద్ద కార్‌పెంటర్‌గా కాంట్రాక్ట్ పనులు చేస్తుంటాడు. మంగళవారం సాయంత్రం విధులు ముగించుకుని సింధియాకు సమీపాన గల షిప్‌యార్డ్ కమర్షియల్ కాంప్లెక్స్ వద్ద జ్యూస్ తాగి తిరిగి రోడ్డు దాటుతున్నాడు. ఆ సమయంలో సింధియా నుంచి మల్కాపురం నేవల్‌బేస్‌కు వెళ్లే మార్గం వైపు 40వ వార్డు ఏకేసీ కాలనీకి చెందిన ప్రవీణ్ అనే యువకుడు తన ద్విచక్ర వాహనంపై వేగంగా వస్తూ రాంబాబును గుర్తించక బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో రాంబాబు తలకు తీవ్ర గాయం కావడంతో చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. మృతుడు రాంబాబు బంధువులు పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు కలుగజేసుకుని వారికి నచ్చజెప్పారు. మల్కాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆదరించండి.. అభివృద్ధి చేసి చూపుతాం

మల్కాపురం: సోదరుడు ఆడారి ఆనంద్‌కుమార్ పశ్చిమ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టి రెండేళ్లలోనే సుమారు రూ.30 కోట్ల మేర వివిధ అభివృద్ధి పనులు చేపట్టారని, అధికారం లేకపోయినా ఇంత అభివృద్ధి చేసిన ఆయన రేపు ఎమ్మెల్యేగా గెలిస్తే ఇంకెంత అభివృద్ధి చేస్తారో ప్రజలు ఆలోచన చేసి ఆయనను గెలిపించాలని యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అన్నారు. 61వ వార్డు ఆర్‌కే పురం, వెంకన్నపాలెం ప్రాంతాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె పై విధంగా వ్యాఖ్యానించారు. కష్టాల్లో ఉన్న వారికి సాయం చేసే వ్యక్తి ఆనంద్ అన్నారు. వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో రమాకుమారి మాట్లాడుతూ సీఎం జగన్ పేదలకు ఎన్నో మేళ్లు చేశారన్నారు. అది గుర్తెరిగా మళ్లీ జగన్‌నే ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. అలాగే విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని, పశ్చిమ ఎమ్మెల్యేగా ఆనంద్‌కుమార్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో 63వ వార్డు పార్టీ ఇన్‌చార్జి పిలకా రామ్మోహన్‌రావు (రాము), పార్టీ వార్డు అధ్యక్షుడు జీవీఎస్ఎన్ రాజు (కేబుల్ వాసు), మంగ, స్వప్న, బాలు, ఎస్.వి. రమణ, బూసి అప్పలరెడ్డి పాల్గొన్నారు.



ఆనంద్‌కుమార్ తరఫున ప్రచారం చేస్తున్న యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

వివాహిత బలవన్మరణం



భర్త, కుమార్తెలతో సౌజన్య(ఫైల్)

గోపాలపట్నం: సీతారామరాజు నగర్‌లో ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడి ఘటన జరిగింది. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్ఈబీ కాలనీ సమీపంలోని సీతారామరాజు నగర్‌లో గల వీకేఆర్కేడ్ అపార్ట్‌మెంట్ మూడో అంతస్తులో గోపిదైల సౌజన్య(33), భర్త రామకృష్ణ, ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తోంది. మంగళవారం రాత్రి భర్త, పిల్లలతో కలిసి బెడ్ రూమ్‌లో నిద్రించింది. మధ్య రాత్రి సమయంలో హాల్‌లోకి వచ్చి ఫ్యాన్‌కు చున్ని కట్టి ఉరి వేసుకుంది. పెద్ద కుమార్తె ఇషిత చూసి తండ్రికి తెలియజేసింది. ఆమెను కిందకి దించి 100కు డయల్ చేసి భర్త సమాచారమిచ్చారు. టీపీటీ కాలనీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో రామకృష్ణ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఇషిత(13), రితిక(10) ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎయిర్‌పోర్టు సీఐ చక్రధరరావు, ఎస్ఐ రామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మానసిక ఆందోళన కారణంగా ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తండ్రి బాబూరావు చెబుతున్నాడు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన ఎయిర్‌పోర్ట్ పోలీసులు సౌజన్య మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.